సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

గాజువాకలో ఘుమఘుమలు

- ఆహారప్రియులకు అందుబాటులో రెస్టారెంట్లు
- నగరంతో సమానంగా గాజువాకలో ఏర్పాటు
- పిజ్జా, బర్గర్, ఫ్రైడ్ చికెన్ వంటకాలకు ఫిదా

నోరూరించే ఇండియన్ డిష్‌లు.. ఆహా అనిపించే చైనీస్, తందూరి, థాయ్ క్యూజిన్స్... పీతలు, ఫిష్ పామ్‌ఫ్రెట్ తదితర సీఫుడ్... థాయ్, డ్రాగన్ సూప్ అండ్ స్టార్టర్స్.. ఈ వంటకాలన్నీ గాజువాకలోనే అందుబాటులో ఉండడంతో భోజన ప్రియులు ఆస్వాదిస్తున్నారు. దూరంగా సిటీలోని స్టార్ హోటల్స్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేరువలోనే లభ్యం కావడంతో సమయమూ కలిసివస్తోందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బంధుమిత్రులతో సరదాగా హోటల్‌లో డిన్నర్

గాజువాక: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న గాజువాకలో హోటళ్లు విస్తరిస్తున్నాయి. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలతో పాటు వందల సంఖ్యలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రావడంతో వాణిజ్య, వ్యాపార సంస్థలు కూడా పెద్ద ఎత్తున ప్రారంభమవుతున్నాయి. దీంతో ఏటేటా జన సంఖ్య లక్షల్లో పెరుగుతోంది. వారి అవసరాలు తీర్చే విధంగా ఇక్కడ సకల సౌకర్యాలు కలిగిన హోటళ్లు సైతం పెరుగుతున్నాయి.

పార్సిల్ కౌంటర్ నుంచి స్టార్ హోటల్స్ వరకు..

గతంలో ఇక్కడ త్రీస్టార్ రేటింగ్‌తో ఒకే ఒక హోటల్ ఉండేది. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కొత్త హోటళ్లు రాలేదు. పదేళ్ల క్రితం ఇండియన్, చైనీస్, థాయ్ తదితర డిష్‌లతో మరో హోటల్ ప్రారంభమైంది.



వడ్డించడానికి సిద్ధంగా ఉన్న డిషెస్

ఇప్పుడు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన త్రీస్టార్ హోటళ్లు, దానికి అనుబంధంగా కూర్మన్నపాలెంలో ఇంకొన్ని హోటళ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో గాజువాకలో పార్సిల్ కౌంటర్లు (టేక్ ఎవే రెస్టారెంట్లు) కూడా గణనీయంగా పెరిగాయి. పూర్తి ఏసీ సౌకర్యం కలిగిన హోటళ్లు గాజువాకలోనే ఇరవై వరకు ఏర్పాటయ్యాయి. సాధారణ హోటళ్లు సుమారు మరో 25 వరకు ఉన్నాయి. వీటికి బిర్యానీ పాయింట్లు, దాబాలు అదనం. ఇటీవల ఫ్రైడ్ చికెన్ రెస్టారెంట్లు బాగా విస్తరిస్తున్నాయి. గాజువాక పట్టణంలో 25 వరకు పార్సిల్ కౌంటర్లు ఉంటాయని అంచనా. వీటితో పాటు వివిధ ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు వీలుగా స్టార్ రేటింగ్ కలిగిన హోటళ్లలో ఫంక్షన్ హాళ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. యువత ఇష్టపడే రెస్టారెంట్లు, పిజ్జా కోసం అంతర్జాతీయ సంస్థలకు అనుబంధంగా ఉన్న రెస్టారెంట్లు, ప్రత్యేకంగా చికెన్‌తో తయారు చేసే వివిధ వెరైటీల ఫుడ్ ఐటమ్‌లు



ఓ హోటల్‌లో వంటకాలను సిద్ధం చేస్తున్న చెఫ్‌లు

ఇప్పుడు గాజువాకలో అందుబాటులో ఉన్నాయి. పిజ్జా, బర్గర్లు, కేక్‌లు డోర్ డెలివరీతో కూడిన వ్యాపారం అనూహ్యంగా సాగుతోంది. నగరంలోని స్టార్ హోటళ్లలో లభించే ఆహార పదార్థాల నాణ్యత, ప్రమాణాలకు దీటుగా ఇక్కడ కూడా వివిధ వెరైటీలకు సంబంధించిన ఆహారపదార్థాలు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు మరో వైపు చూడటం లేదు. హోటళ్ల నిర్వాహకులు కూడా ప్రొఫెషనల్స్‌తో వాటిని వండి వడ్డిస్తుండటంతో హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. వీకెండ్స్‌లో ప్రత్యేక ఫుడ్‌తో బఫే సౌకర్యాన్ని కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు.

అందుబాటులో మంచి హోటళ్లు



గాజువాకలో మంచి మంచి హోటళ్లు అందుబాటులో ఉన్నాయి. వాటితో పాటు సాధారణ హోటళ్లు కూడా ఉన్నాయి. గాజువాక అన్ని రకాలుగా అభివృద్ధి బాటలో పయనిస్తున్న కారణంగా ఇక్కడ రెస్టారెంట్లు, హోటళ్ల వ్యాపారం బాగా పెరిగింది. మనం ఏ రకమైన ఆహారం కోరుకుంటే అది దొరుకుతుంది. గడిచిన పదేళ్లలో ఇలాంటివి బాగా పెరిగాయి.

– కె.సుమన్, గాజువాక

కర్రీ పాయింట్లతో సౌకర్యంగా ఉంది



గతంలో హోటళ్లలో మొత్తం భోజనం ప్యాక్ చేయించి తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కర్రీ పాయింట్లు ఎక్కడికక్కడ అందుబాటులోకి వచ్చాయి. ఏ కూర కావాలంటే అది దొరుకుతుంది. ఇంట్లో అన్నం వండుకుని కూర ఒక్కటి తీసుకెళ్తే పూట గడిచిపోతుంది. పిల్లలు అడిగిన అన్ని రకాల ఆహార పదార్థాలు ఇప్పుడు గాజువాకలో దొరుకుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టుకుంటే నేరుగా ఇంటికే డెలివరీ ఇచ్చేస్తున్నారు.

– ఉరుకూటి గోవిందరాజు, గాజువాక

క్లుప్తంగా

వర్షంతో ఊరట



వుడా కాలనీ ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

పెదగంట్యాడ: వర్షం ఊరటనిచ్చింది. గత రెండు మూడు రోజులుగా భానుడి ప్రతాపంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనానికి బుధవారం సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ లేకపోయినా ఉక్కపోత వేధించింది. సాయంత్రం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పుతో చల్లని గాలులు వీచాయి. ఆపై చిరుజల్లులు కురిశాయి. వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి.

కరెంట్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం



కోలా జోగి నాయుడు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అమ్మవారి పండగకు లైటింగ్ పనులు నిర్వహిస్తున్న వ్యక్తి కరెంట్ షాక్‌కు గురై దుర్మరణం చెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక సింహగిరికాలనీకి చెందిన కోలా జోగినాయుడు (43) ఆటో డ్రైవర్. స్థానికంగా లైటింగ్ పనులు కూడా చేస్తుంటాడు. కాలనీలో అమ్మవారి పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి సీరియల్ లైటింగ్ పనులు చేస్తున్న సమయంలో వర్షం పడుతుండటంతో ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన జోగినాయుడును స్థానికులు గాజువాకలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఐకు ప్రశంసా పత్రం



సీపీ రవిశంకర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐ వి.శ్రీనివాసరావుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ ప్రశంసా పత్రం అందజేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా జరగడానికి కృషి చేసిన నగరంలోని 22మంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, నలుగురు క్రైం, ట్రాఫిక్ సీఐలను ఆయన అభినందించారు. కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీ రవిశంకర్ సీఐలకు ప్రశంసా పత్రాలతో పాటు రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ–2 మోకా సత్తిబాబు, డీసీపీ–1 లక్ష్మీనారాయణ, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నియోజకవర్గం నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. బీహెచ్‌పీవీ దరి సంతోషిమాత ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొడమంచిలి పాపారావు, అధ్యక్షుడిగా పోలారావు, కార్యదర్శిగా శ్రీను, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గులిమి రాజు, కోశాధికారిగా అరిపాక రమణలతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్షుడు పోలారావు మాట్లాడుతూ కొద్ది సంవత్సరాలుగా కార్యవర్గం లేకపోవడంతో సంఘం కార్యకలాపాలు ఆగిపోయాయని, వాటిని తిరిగి ప్రారంభిస్తామన్నారు. గౌరవ అధ్యక్షుడు పాపారావు మాట్లాడుతూ హక్కుల సాధనకు ఐక్యతతో కృషి చేస్తామన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

గాజువాక: జాతీయ న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న ఈ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంకు కేసులు, విద్యుత్, నీరు, టెలిఫోన్, యుటిలిటీ తగాదాలు, క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, పెట్టీ కేసులు, మున్సిపల్ వివాదాలు, పెండింగ్‌లో ఉన్న, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బుజ్జాయిల కోసం త్రీడీ ఫొటో స్టూడియో



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు, నిర్వాహకులు

పెదగంట్యాడ: బుడి బుడి అడుగుల బుజ్జాయిల కోసం కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ వంతెన వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన బేబీ బెల్ త్రీడీ ఫొటో స్టూడియోను బుధవారం ప్రారంభించారు. గాజువాక ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు ఈ స్టూడియోను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ త్రీడీ ఫొటో స్టూడియోను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ స్టూడియోలో సుమారు 40కి పైగా త్రీడీ సెట్స్ సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల బాలలకు ప్రీ బర్త్ డే షూట్స్ ఉంటాయని, అలాగే చిన్నారులకు అవసరమైన షూ, దుస్తులు, వస్తువులను సైతం తామే సమకూరుస్తామని చెప్పారు. బీచ్‌లు, పార్కులకు వెళ్లకుండానే ఇక్కడ బ్యాక్‌గ్రౌండ్‌లను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో స్టూడియో అధినేతలు అనూప్ పులుగు, రామ్మోహన్,ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్
- 65, 76 వార్డుల్లో అభివృద్ధి పనుల పరిశీలన



తోకాడలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఏడీసీ విశ్వనాథన్

పెదగంట్యాడ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. జీవీఎంసీ 65వ వార్డులోని ఇండోర్ స్టేడియంతో పాటు 76వ వార్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్తగా చేపట్టిన పార్కు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఏయే పనులు చేస్తున్నారో నిశితంగా చూశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇండోర్ స్టేడియం లోపల సీలింగ్, గచ్చులు, బయట ఎలివేషన్ పనులను గతంలోనే ప్రారంభించినా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత పనులు నిలిపివేశారు. కోడ్ అనంతరం పనులు పునఃప్రారంభం కావడంతో ఆ పనులను ఏడీసీ విశ్వనాథన్ స్వయంగా పరిశీలించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు.



హెచ్‌బీ కాలనీలోని పార్కులో పనుల తీరును అడిగి తెలుసుకుంటున్న ఏడీసీ విశ్వనాథన్

అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించినా, నాణ్యత పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీసీ పర్యటనలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, డీఈ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

72వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఏడీసీ విశ్వనాథన్ హెచ్చరించారు. 72వ వార్డు కుంచుమాంబ కాలనీ, తోకాడ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. తోకాడలోని చెరువును, శ్మశానవాటికను పరిశీలించారు. కుంచుమాంబ కాలనీలో పలు చోట్ల డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైనేజీల్లో ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయి ఉండటం గమనించారు. వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణపై మరింత శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. జెడ్సీతో పాటు ఎస్‌ఈ గోవిందరాజు, గాజువాక ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, ఏసీపీ శ్రీలక్ష్మి, ఈఈ ప్రసాదరావు, వాటర్ విభాగం, శానిటరీ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత పీవీ చలపతిరావు



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక: మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ మాజీ అధ్యక్షుడు పీవీ చలపతిరావు ఆదర్శ నాయకుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. చలపతి రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరణంరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్షుడిగా ఆయన నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉండేవారన్నారు. ఒక్కపక్క ప్రజా సమస్యలపై అలుపెరగకుండా పోరాడుతూనే మరోపక్క పార్టీని బలోపేతం చేశారన్నారు. నేటి యువతకు ఆయన ఆదర్శమని, ఆయన బాటలో పార్టీ శ్రేణులు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బొండా ఎల్లాజీరావు, పి.నాగేశ్వరరావు, కోసూరు తాతారావు, పేర్ల అప్పారావు, టి.వెంకటరావు, అనిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1231వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో పాల్గొన్న రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ ఉక్కు పురోభివృద్ధి సాధించగలదన్నారు. సెయిల్ నుంచి వేరు చేసే సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన వనరులు సమకూర్చుతామని హామీ ఇచ్చారని, కాని నెరవేర్చలేదు సరికదా లాభాల్లో ఉన్న ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టేసి నామమాత్రపు రేటుకు అమ్మేయాలని చూస్తుండడం దారుణమన్నారు. విశాఖ



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు రామస్వామి

ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావల్సిన మైన్స్ అనుమతులు వెంటనే ఇప్పించాలని వర్కింగ్ క్యాపిటల్‌ను అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రామారావు, విల్లా రామ్మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు

పెదగంట్యాడ: బాల్య వివాహాలు అనర్థాలకు మూలమని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కళాజాత కళాకారులు వివరించారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఇస్లాంపేట సెక్టార్ పరిధిలోని రెడ్డి ముసలయ్యపాలెం, పెదనడుపూరు, సీతానగరం–2, దల్లివానిపాలెం, కోనవానిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన వారి కోసం దుర్గవానిపాలెం సచివాలయం వద్ద బుధవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కు చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

గురించి ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో గుర్తింపు

ఉక్కునగరం: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని స్టీల్ ప్లాంట్ మీడియం మర్చంట్ అండ్ స్ట్రక్చరల్ మిల్ విభాగాధిపతి సైబాల్ సేన్ అన్నారు. ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు ఎ.పార్థసారథి, ఆర్.చిన్నయ్య, ఆర్.ముసలయ్యలను విభాగంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సేన్ మాట్లాడుతూ సీనియర్ ఉద్యోగుల సేవలు అమూల్యమైనవన్నారు. వారు చేసిన కృషి వల్ల ప్లాంట్ అభివృద్ధి పథంలో నడవగలిగిందన్నారు. జూనియర్ ఉద్యోగులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఐ.ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అధికారులు పాల్.



ఉద్యోగి ముసలయ్యను సత్కరిస్తున్న విభాగాధిపతి సేన్

ఎ.వి. సత్యనారాయణ, ఎం.చంద్రశేఖర్, ఎం.డి. బోయర్, బి.గణేష్, మనోజ్ ఓరాన్, కార్మిక సంఘాల నాయకులు కె.పరంధామయ్య, జి.వి.రమణారావు, జి.ఆనంద్, చిట్టిబాబు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘అగ్నిపథ్’ను రద్దు చేయాలి



ధర్నాలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నాయకులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ నాయకులు పాతగాజువాక జంక్షన్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు మాట్లాడుతూ అగ్ని పథ్ ద్వారా చేపట్టిన నియామకాల్లో ఉద్యోగం కేవలం నాలుగేళ్లు మాత్రమే ఉంటుందన్నారు. అగ్నిపథ్ ద్వారా ఉద్యోగాల్లో చేరిన యువత తర్వాత నిరుద్యోగులుగా మారుతారన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.రాంబాబు, ఈశ్వరరావు, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం చిత్తు

డీఎస్పీ సత్యనారాయణ



మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సబ్బవరం మూడు రోడ్ల కూడలి వరకూ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం మూడు రోడ్ల కడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ యువత,విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల సమాజానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బంగారం లాంటి భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.మాదక ద్రవ్యాలకు బానిసలైన వ్యక్తులు అనారోగ్యం పాలవ్వడమే కాకుండా వారి కుటుంబాలు నాశనమవుతాయన్నారు.మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి సహకరించాలని కోరారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయించినా.. సేవించినా.. రవాణా చేసినా సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో సెబ్ సీఐ పీడీ ప్రసాద్,స్థానిక సీఐ పిన్నింటి రమణ,ఎస్‌ఐలు రాజశేఖర్, ధనుంజయ్‌తో పాటు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు మహిళ బలి

చికిత్స పొందుతూ మృతి



పద్మిని (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అదనపు కట్నం కోసం భర్త, అత్తామామల వేధింపులతో పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. గాజువాక ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అనకాపల్లికి చెందిన మొల్లి అప్పారావు, రమణమ్మల పెద్ద కుమార్తె మొల్లి పద్మిని (26)కి గాజువాక జనతాకాలనీకి చెందిన సోమేష్‌తో 2018లో వివాహం జరిగింది. అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో తమ కుమార్తె ఈ నెల 1వ తేదీన పురుగుల మందు తాగిందని, 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కేజీహెచ్‌లో చేర్పించినట్టు అల్లుడు సోమేష్ 3వ తేదీ సాయంత్రం 7 గంటలకు చెప్పాడని మృతురాలి తండ్రి తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించిందన్నారు. మృతురాలికి 5 సంవత్సరాల కుమార్తె, 1 సంవత్సరం కుమారుడు ఉన్నాడన్నారు. పెళ్లి జరిగిన దగ్గర నుంచి అదనపు కట్నం, విడాకుల కోసం తన కుమార్తెను వేధిస్తున్నారని, ఆమెది ఆత్మహత్య కాదని, వరకట్నం హత్య అని మృతురాలి తండ్రి ఆరోపించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలియజేశారు.

లలితా పీఠంలో దక్షిణామూర్తి ఆరాధన

సీతంపేట: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీలలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస ఆరాధన జరిగింది. లలితానగర్‌లోని పీఠం ఆవరణలో గల దక్షిణామూర్తి మందిరంలో స్వామికి లలిత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి స్వయంగా ప్రత్యేక హారతి సమర్పించారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి

సీతమ్మధార: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పందిరి కూరగాయల సాగు, వేసవిలో పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, మల్చింగ్ పద్ధతిలో కూరగాయుల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వారికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఆధార్ కార్డు, పస్ బీ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ రైతు భరోసా కేంద్రంలో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్.కె.యాసిన్, ఉద్యానవన అధికారి జి.సోని, రైతుబజార్ ఈవో పి.కొండబాబు, సహాయకుడు కె.సతీష్, రైతులు పాల్గొన్నారు.

జీవితానుభవాల నుంచే కథలు

సీతంపేట: రచయితకు సామాజిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కథా కచేరీలో వైవిధ్య భరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవని, జీవితానుభవాలే కథలకు ముడిసరుకని పేర్కొన్నారు. కథా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. పీడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టి కోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే ఔత్సాహిక రచయితలు కలం పట్టాలన్నారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్, సిహెచ్.చిన సూర్యనారాయణ తదితరులు కథా పఠనం చేశారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
✆ 7997958388, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
✆ 9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com